## క్లుప్తంగా

### రోడ్డుపై చెత్తతో ఇబ్బందులు



రోడ్డుపై రాత్రి సమయంలో వేసిన చెత్త

**పాయకరావుపేట :** సత్యవరం గ్రామ సమీపాన తాండవ నది వద్ద రోడ్డు పైనే చెత్తను వేయడం కారణంగా పలువురు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సత్యవరం నుండి పెదరాంభద్ర పురం గ్రామం పోవు రోడ్డు పైన, తాండవ నదిపై నిర్మించిన వంతెన వద్ద చెత్తను ట్రాక్టర్లతో రాత్రి సమయంలో వేస్తున్నారు. దీంతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన చెత్తను రాత్రి సమయంలో ఇక్కడకు తెచ్చి రోడ్డుపై వేస్తున్నట్టు సత్యవరం సర్పంచ్ సకిలేటి రాము తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.

### విద్యుత్ తీగల సమస్య పరిష్కారం



విద్యుత్ తీగలను సరిచేస్తున్న జూనియర్ లైన్‌మన్

**కోటవురట్ల:** కె.వెంకటాపురంలో చాలా కాలంగా ఉన్న విద్యుత్ సమస్యలను ఆ శాఖాధికారులు పరిష్కరించారు. గ్రామంలో పలు చోట్ల కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగెలను సరిచేసి ప్రమాదాలను నివారించారు. గెద్దం వారి వీధిలో విద్యుత్ తీగెలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉండడంతో స్థానికులు భయాందోళన చెందేవారు. దీనిపై విద్యుత్ శాఖాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఏఈ చంద్రమౌళి చర్యలు తీసుకున్నారు. గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

### సంపద తయారీ కేంద్రాలతో ఆదాయం

**మునగపాక:** సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా మూలపేటలో నిర్మాణంలో ఉన్న సంపద తయారీ కేంద్రం పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సంపద తయారీ కేంద్రాల్లో ఎరువులను సమకూర్చి విక్రయాలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వార్డు సభ్యుడు మొల్లేటి గోవిందరావు పాల్గొన్నారు.

### ఘనంగా కోదండ సీతారామ స్వామి ఆలయ వార్షికోత్సవం



ఆకట్టుకున్న మహిళల కోలాటం

**మునగపాక:** గవర్ల అనకాపల్లిలో గౌరీగిరి కొండపై ఉన్న కోదండ సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సీతారాములను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పాలమరశెట్టి అప్పలరాజు చర్యలు తీసుకున్నారు.

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

**రాంబిల్లి :** వెంకటాపురం యూపీ స్కూల్లో సోమవారం పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఈ పాఠశాలలో 2000–2008 సంవత్సరాల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు కలుసుకొని అప్పటి ఉపాధ్యాయులు మోజేష్, కృష్ణవేణి, సూర్యకళ, విజయబాబు, రేవతి, స్వరూపరాణిలను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులంతా తీపి జ్ఞాపకాలను నెమరువేసుకొని రోజంతా ఆనందంగా గడిపారు.



# నేత్రపర్వంగా భావనారుషి కల్యాణం



భావనారుషి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

**నక్కపల్లి:** మండలంలో చుక్కలవాని లక్ష్మీపురంలో భద్రావతి సమేత భావనారుషి కల్యాణ మహోత్సవం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. శూలాల సంబరాన్ని పురస్కరించుకుని గ్రామానికి చెందిన పద్మశాలీలు ప్రతి ఏటా మాఘమాసంలో ఈ కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. సోమవారం ఉదయం ఉత్సవ విగ్రహాలకు పుష్పాలంకరణ, కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం విభూది పండ్లు ఊరేగింపు జరిగింది. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన జరిపారు. అనంతరం భజన కార్యక్రమం, సాయంత్రం 3 గంటలకు అమ్మవారి పుట్టింటి సారె ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. నగర సంకీర్తన, దీపోత్సవం కనులపండువలా జరిగింది. రాత్రి 7 గంటలకు అశ్వరథ ప్రతికార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మెగా డూప్స్ కార్యక్రమం నిర్వహించారు. సంబరాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు, ప్రజలు తరలివచ్చారు. ఉత్సవాల సందర్భంగా విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది.

## అగ్నిప్రమాద బాధితురాలికి వితరణ



అగ్నిప్రమాద బాధితురాలికి సరకులు అందజేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ తదితరులు

**ఎస్.రాయవరం :** తిమ్మాపురం శివారు కోనవాని పాలెం గ్రామంలో పూరిల్లు కాలి బూడిదయ్యి వృద్ధురాలు రోడ్డున పడింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కొర్ని గురువులమ్మ చెందిన ఇంట్లో సోమవారం మంటలు చెలరేగి కాలి బూడిదైందని వార్డు మెంబరు సింహాద్రియాదవ్ తెలిపారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కర్రిసత్యనారాయణ తక్షణ సహాయంగా 25 కిలోల రేషన్, నిత్యావసర వస్తువులు, కూరగాయలు, వస్త్రాలు అందజేశారు. ఈ ప్రమాద వివరాలు గ్రామ రెవెన్యూ అధికారి నూకరాజు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సదుపాయం వెంటనే అందేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సరుకులు ఇచ్చిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగంబోయిన శ్రీనివాసరావు, కోన దుర్గబాబు తదితరులు ఉన్నారు.

## అభ్యసనా నైపుణ్యాలు పెంచాలి



మాట్లాడుతున్న నూకరాజు ప్రసాద్ తదితరులు

**నక్కపల్లి :** విద్యార్థుల్లో అభ్యసనా నైపుణ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో డీవీడీ ప్రసాద్, మండల లిప్ మోనిటరింగ్ అధికారి వేమగిరి నూకరాజు అన్నారు. సోమవారం వారు స్థానిక ఉన్నత పాఠశాలలో నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో తెలుగు ఉపాధ్యాయుల లిప్ స్కూలు కాంప్లెక్స్ ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. పిల్లల పూర్వజ్ఞానాన్ని పరిశీలించి బోధన చేయాలన్నారు. అందుబాటులో ఉన్న వనరుల నుపయోగించి కృత్యాల ద్వారా ఆసక్తి కలిగించేలా బోధన చేయాలన్నారు. భాషా సామర్థ్యాలపై దృష్టి సారించి వాటి పెంపుదలపై బాధ్యత వహించాలన్నారు. ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్ ఆచార్యులు, రమణ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



ఐటీఐ వద్ద ఏర్పాటు చేసిన డ్రగ్స్ రహిత ఏపీ సూచన బోర్డు

**పాయకరావుపేట :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలని సీఐ పి.అప్పలరాజు అన్నారు. పట్టణంలో గల ఆదిత్య ఐటీఐలో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సీఐ మాట్లాడారు. యువకులకు ముందుగా కొందరు మత్తు పదార్థాలను ఉచితంగా అలవాటు చేస్తారన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. విద్యార్థులు సిగరెట్టు, ఖైనీ, గంజాయి, గుట్కా, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండి ఆరోగ్యాలను కాపాడుకుంటూ, ఉత్తమ పౌరులుగా ఎదిగి అభివృద్ధి చెందాలన్నారు. సమావేశంలో ఎస్ఐలు ఎస్.రమేష్, బి.జోగారావు, ఆదిత్య ఐటీఐ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ పేరుతో డ్రగ్స్ రహిత సమాజం – సంక్షేమానికి సంకేతం అనే బోర్డును ఏర్పాటు చేశారు.

## టైలర్ కుటుంబానికి ఆర్థిక సాయం



టైలర్ జిన్నా కుటుంబానికి రూ.5వేలు సాయం అందజేస్తున్న దాతలు

**మునగపాక :** గవర్ల అనకాపల్లిలో టైలర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగించి ఇటీవల మృతి చెందిన షేక్ జిన్నా కుటుంబ సభ్యులకు టైలర్ల సంఘం ద్వారా రూ.5వేల సాయాన్ని సోమవారం అందజేశారు. నిరుపేద అయిన జిన్నా కుటుంబానికి సాయం అందించేందుకు పలువురు ముందుకొచ్చారు. సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి నాగప్పారావు .3వేలు, టైలర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి రూ.2వేలు వెరసి రూ.5వేలు సమకూరడంతో జిన్నా కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టైలర్ల సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆళ్ల వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నేత షేక్ ఇస్మాయిల్, ఎంపీటీసీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

## చినబొడ్డేపల్లిలో డ్రోన్ సర్వే



చినబొడ్డేపల్లిలో డ్రోన్ సర్వేను ప్రారంభించిన సర్పంచ్ శివరామ్

**కోటవురట్ల :** భూ వివాదాల శాశ్వత పరిష్కారం కోసమే వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం అని సర్పంచ్ పైల శివరామ్ అన్నారు. చినబొడ్డేపల్లి గ్రామంలో సోమవారం డ్రోన్ సర్వే ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా భూ సమస్యలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, అక్రమాలకు పాల్పడడం వల్ల ఎందరో రైతులు నష్టపోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సర్వేను సమగ్రంగా నిర్వహించడం ద్వారా రికార్డులు స్వచ్ఛీకరణ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అల్లూరి సూర్యనారాయణరాజు, మాజీ ఎంపీటీసీ పైల సత్యనారాయణ, గ్రామపెద్దలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పాము కలకలం



అంగన్‌వాడీ కేంద్రంలోకి చొరబడిన పాము

**కోటవురట్ల:** అంగన్‌వాడీ కేంద్రంలో పాము కలకలం సృష్టించింది. సకాలంలో స్థానికులు స్పందించడంతో పిల్లలు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. చినబొడ్డేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం యథావిధిగా పిల్లలు అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకోగా కొద్ది సమయానికి కిటికీలో నుంచి పాము లోపలకు చొరబడింది. గమనించిన అంగన్‌వాడీ కార్యకర్త భ్రమరాంబ కేకలు వేయడంతో సర్పంచ్ పైల శివరామ్‌తో పాటు స్థానికులు లోపలకు వచ్చి పామును హతమార్చారు. సకాలంలో పామును గుర్తించడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే అంగన్‌వాడీ భవనం పూర్తిగా శిథిలమై కిటికీ తలుపులు పుచ్చిపోవడం వల్ల విష పురుగులు లోపలకు చొరబడుతున్నాయని, కొత్త భవనం మంజూరుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచు శివరామ్ కోరారు.

## ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

**రాంబిల్లి :** రాంబిల్లి శివారు కుండలదేవునిపాలెంలో సోమవారం ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తప్పెటగుళ్లు, కోలాటాలు, భజన కార్యక్రమాలతో ఉత్సవం సందడిగా నిర్వహించారు.

# వృద్ధ కళాకారుడికి ఆర్థిక సహాయం



అనారోగ్యంతో ఉన్న కళాకారున్ని పరామర్శిస్తున్న ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

**యలమంచిలి :** అనారోగ్యంతో మంచాన పడి ఉన్న వృద్ధ కళాకారుడికి యలమంచిలి ఘంటసాల కల్చరల్ అసోషియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. కశింకోట మండలం పల్లపు సోమవరం గ్రామానికి చెందిన ప్రముఖ రంగ స్థల హార్మోనిస్టు పుల్లా వీరినాయుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనను యలమంచిలి ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ సభ్యులు సోమవారం పరామర్శించి నిత్యవసర సరుకులు, మందులు, ఆర్థిక సహాయం అందజేశారు. అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ నాటక రంగానికి ఎన్నో సేవలందించిన వీరినాయుడు హార్మోనియం, తబలా వాయిద్యంలో పేరు ప్రఖ్యాతులు గడించి రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల్లోనూ కళాభిమానులను ఆకట్టుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆడారి పూరీ జగన్నాథం, సూరిబాబు, కోన శంకర్రావు, ఆవాల నూకరాజు యలమంచిలి అప్పారావు పాల్గొన్నారు.

## సీఎం, మంత్రులను విమర్శించే స్థాయి అనితకు లేదు

మాజీ ఎమ్మెల్యేపై మండిపడ్డ వైఎస్సార్‌సీపీ నేతలు



పాయకరావుపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న నాయకులు

**పాయకరావుపేట :** ప్రభుత్వ పెద్దలను విమర్శించడం మాని.. ముందు తనకు టికెట్ వస్తుందో లేదో చూసుకోవాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనితకు జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, పాయకరావుపేట మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గూటూరు శ్రీను హితవు పలికారు. సోమవారం వారు పాయకరావుపేటలో విలేకర్లతో మాట్లాడుతూ విద్యావ్యవస్థలో పలు సంస్కరణలు తెచ్చి నాడు–నేడు పథకం కింద పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు, ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లిష్ మీడియంను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి జగనన్నను మాజీ ఎమ్మెల్యే అనిత విమర్శించడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రెండుసార్లు యనమల కుటుంబంపై రాజా గెలుపొందారని, ఆయనను విమర్శించే స్థాయి అనితకు లేదన్నారు. పాయకరావుపేట ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అనిత పాల్పడిన అవినీతి గురించి ఆ పార్టీ నాయకులే చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. సీఎంను, మంత్రులను తిడితే టికెట్ వస్తుందన్న భ్రమలో అనిత ఉందన్నారు. ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో డిగ్రీ కళాశాల, ఆస్పత్రి అప్‌గ్రేడ్, మెయిన్‌రోడ్డు విస్తరణ, పాయకరావుపేట పీహెచ్‌సీ భవనాలు మంజూరు చేయిస్తానని హామీలు ఇచ్చి ఒక్కటి కూడా ఆమె నెరవేర్చలేకపోయిందన్నారు. ఇకపై వైఎస్సార్‌సీపీపైనా, సీఎంపైనా విమర్శలు మానుకోకపోతే తగిన గుణపాఠం చెప్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, మండల పార్టీ అధ్యక్షుడు దనిశెట్టి బాబూరావు, వైస్ ఎంపీపీ పల్లేల మణికంఠస్వామి, ఉప సర్పంచ్ జగతాశ్రీను, పార్టీ నాయకులు వేమగిరి లక్ష్మణ్, పల్యాల లచ్చబాబు పాల్గొన్నారు.

## సచివాలయ వ్యవస్థతో మరింత బాధ్యత



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న సర్పంచ్ సత్యనారాయణ

**ఎస్.రాయవరం:** గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సర్పంచ్‌లకు ప్రత్యేక బాధ్యతలు కల్పించారని మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపురం గ్రామ సచివాలయంలో సర్పంచ్ పదవీకాలం రెండేళ్లు పూర్తవడంతో సోమవారం కేక్ కట్ సచివాలయ సిబ్బందికి, గ్రామ పాలకమండలి సభ్యులకు పంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో సర్పంచ్ కేవలం సేవకే పరిమితం కావాల్సి వచ్చేదని, సచివాలయ వ్యవస్థ రాగానే బాధ్యత మరింత పెరిగిందన్నారు. గ్రామ వలంటీర్లకు, సచివాలయ ఉద్యోగులతో పనులతో గ్రామాభివృద్ధి శరవేగంగా జరిగేలా చూడాల్సి వస్తుందన్నారు. శాఖలవారిగా సిబ్బంది అందుబాటులో ఉండడంతో ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతున్నాయన్నారు. మండల కార్యాలయాలు చుట్టూ తిరిగే గ్రామస్తులకు గ్రామ సచివాలయాల్లో పరిష్కారం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వార్డుమెంబర్ సింహాద్రియాదవ్ పాల్గొన్నారు.

## 'స్పర్శలేని మచ్చలుంటే లెప్రసీ కావొచ్చు'



లెప్రసీ నివారణపై అవగాహన ర్యాలీ

**ఎస్.రాయవరం :** శరీరంపై స్పర్శలేని మచ్చలుంటే లెప్రసీ అయ్యే అవకాశం ఉందని ఫ్యామిలీ డాక్టర్ క్లినిక్ క్లష్టర్ సూపర్‌వైజర్ పి.ఎస్.వి.ఎస్ ప్రసాద్ అన్నారు. స్పర్శ కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో భాగంగా ఎస్.రాయవరంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. బజారు వీధిలో మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. లెప్రసీ వ్యాధి సోకితే గుర్తించాల్సిన వివరాలు తెలిపారు. చర్మంపై స్పర్శ లేని రాగిపండు మచ్చ, చేతివేళ్లు, పాదాల్లో, నరాల్లో తిమ్మిరిలు లెప్రసీకి సంకేతంగా తెలుసుకోవచ్చన్నారు. ఈ లక్షణాలు కలిగిన వారు వెంటనే చికిత్స చేయించుకుని ఉపశమనం పొందాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్షణరావు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ,ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## హాస్టల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ



హాస్టల్లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో, ఎంఈవోలు

**నక్కపల్లి :** మండలంలో ఎస్సీ బాలుర వసతి గృహంలో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈవో డీవీడీ ప్రసాద్‌లు తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని రుచి చూశారు. భోజనం సరిగా లేదని, హాస్టల్ పరిసరాలు అధ్వానంగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని, నిర్ణీత పరిమాణంలో భోజనం ఉండడం లేదన్న విషయాన్ని గుర్తించారు. దీనిపై వసతి గృహసిబ్బందిని నిలదీశారు. ఇక నుంచి ఇటువంటి పరిస్థితులు పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. హాస్టల్లో రికార్డులు తనిఖీ చేశారు. పదిమంది విద్యార్థులు పాఠశాలకు వెళ్లని విషయాన్ని గుర్తించారు. మంచినీటి సదుపాయం లేదని విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు.

## మంత్రిని కలిసిన ఐక్యవేదిక నాయకులు



మంత్రి అమర్‌నాథ్‌తో ఐక్యవేదిక నాయకులు ఎర్రయ్య, హరిబాబు

**రాంబిల్లి :** పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను నేవీ నిర్వాసితుల ఉద్యమ ఐక్యవేదిక నాయకులు సీహెచ్ ఎర్రయ్య, బద్ది హరిబాబు సోమవారం విజయవాడలో కలిశారు. రేషన్ కార్డు యూనిట్‌గా గల కుటుంబానికి నెలకు రూ.13వేలు జీవనభృతిని చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని మంత్రి తెలిపారని ఎర్రయ్య పేర్కొన్నారు. మేజర్లు అయిన కుమారులకు కూడా ఈ జీవన భృతి వర్తించేలా డిఫెన్స్ సెక్రటరీతో మాట్లాడతామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. దీంతో పాటు నేవీ పునరావాసకాలనీని అభివృద్ధి చేసి అర్హులైన వారికి ఉపాధి కల్పిస్తామని, గోవిందపాలెం, వాడపాలెం, చినకలవలాపల్లి, కొత్తపేట గ్రామాలను రెండో దశలో నేవీ ప్రభావిత గ్రామాలుగా గుర్తించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని మంత్రి స్పష్టం చేసినట్లు ఎర్రయ్య తెలిపారు.

## యలమంచిలి ఏడీఏగా రవి ప్రకాష్



బాధ్యతలు చేపట్టిన రవిప్రకాష్

**యలమంచిలి :** యలమంచిలి వ్యవసాయ సబ్ డివిజనల్ అధికారిగా ఆర్.రవి ప్రకాష్ సోమవారం యలమంచిలి వ్యవసాయ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. పాడేరు నుంచి యలమంచిలికి బదిలీపై వచ్చారు. యలమంచిలి డివిజన్‌లో నాలుగు మండలాల వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ధాన్యం కొనుగోలుపై అధికారులతో చర్చించారు. వ్యవసాయ పంటలు, సాగు విధానం, రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీ, పంటల బీమా, ఎరువుల ఉత్పత్తిపై అధికారులతో మాట్లాడి రైతులకు అందించవలసిన సూచనలు సలహాలపై సమీక్షించారు. వ్యవసాయాధికారులు సుమంత, సౌజన్య, ఉమాదేవి, శంకర్ గోవింద్ పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**మునగపాక :** ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోరారు. తోటాడ సచివాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ సేవలను ఆమె పరిశీలించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో ఇంటింటికీ వైద్య సేవలందించేలా ఫ్యామిలీ డాక్టర్ విధానం అందుబాటులోకి తెచ్చారన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్, సీహెచ్‌వో దేవకాంత తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.